సంపాదకీయం

పాక్ నయవంచక విధానాలు !

ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్...కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పుడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్భాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్థాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్థాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్థాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్థాన్ ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్‌,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్థాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది. అమెరికా, పాకిస్థాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక పన్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్థాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్థాన్తన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్థాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బందంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్థాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పన్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్థాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్థాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పన్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్థాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు.

ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్థాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్థాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చుకోవడానికి పాక్ వెనకాడకపోవచ్చు. ఆ దేశ రక్షణమంత్రి, ఆర్మీ చీఫ్‌లు అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిందే.

దీపావళి పండగపై గందరోగళం

మొదటిపేజీ తరువాయి..

పండగను అక్టోబర్ 20న వస్తుందని చెబుతుండగా.. మరికొందరు అక్టోబర్ 21న జరుపుకుంటారని అంటున్నారు. ఈ నేపథ్యంలో దీపావళి పండగను ఏ రోజున జరుపుకోవాలనే చర్చ మొదలయ్యింది. దేశంలోని ప్రముఖ పండితుల సంస్థ 'కాశీ విద్వత్ పరిషత్' ఈ సంవత్సరం దీపావళిని అక్టోబర్ 20న జరుపుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి పండగ తేదీల గందరగోళం నేపథ్యంలో తాజాగా కౌన్సిల్ ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో దీపావళి తేదీపై సుదీర్ఘంగా చర్చించారు. మతపరమైన సూత్రాలు, లేఖనాత్మక లెక్కల ఆధారంగా పూర్తి ప్రదోష కాలం అక్టోబర్ 20న మాత్రమే ఉంటుందని తేల్చారు. అక్టోబర్ 21న అమావాస్య మూడున్నర గంటలకు పైగా ఉండటంతో నక్త ఉపవాసం (లక్ష్మీ ఆరాధనలో ముఖ్యమైన భాగం) విచ్ఛిన్నం చేయడానికి ఆ రోజు సమయం ఉండదు. అందువల్ల అక్టోబర్ 20న దీపావళిని జరుపుకోవాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా నిర్ణయించింది. కాశీ విద్వత్ పరిషత్ సమావేశం కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రామచంద్ర పాండే అధ్యక్షతన ఇటీవల జరిగింది. ఈ సమావేశానికి కాశీ విద్వత్ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి ,బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రామనారాయణ ద్వివేది హాజరయ్యారు.

ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం హామీ

దీపావళి లోపల రూ.300 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 13వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మెను, కళాశాలల బంద్ కార్యక్రమాన్ని అక్టోబర్ 23వ తేదీ వరకు (దీపావళి మరుసటి రోజు వరకు) వాయిదా వేయాలని నిర్ణయించారు. అయితే, దీపావళి నాటికి బకాయిలు విడుదల కాకపోతే.. అక్టోబర్ 23న మళ్లీ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటాం మని సమాఖ్య స్పష్టం చేసింది. ఇక, దసరా ముందు విడుదల చేసిన రూ.200 కోట్ల బకాయిల్లో సుమారు 70 మైనారిటీ, జనరల్ కళాశాలలకు ఒక్క రూపాయి కూడా అందలేదని సమాఖ్య పేర్కొంది. ప్రభుత్వం వెంటనే నిధుల విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

జూబ్లీ దంగల్

త్రిముఖ పోరులో విజేతలెవరో..?

అభ్యర్థిని ప్రకటించిన బిఆర్ఎస్

కసరత్తు చేస్తున్న కాంగ్రెస్, బిజేపి

రేసు నుంచి తప్పుకున్న మజ్లీస్.. కాంగ్రెస్‌కు మద్దతు..?

పోటీకి నో చెప్పిన టిడిపి.. తటస్థంగా ఉండాలని నిర్ణయం

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోరు రసవత్తరంగా మారింది. బిఆర్ఎస్ తన అభ్యర్థిని ఇప్పటికే ప్రకటించి ప్రచారపర్వంలో దూసుకు పోతుండగా, కాంగ్రెస్, బిజేపిల కసరత్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. మజ్లీస్, టిడిపిలు జూబ్లీ బరిలో నిలవకూడదని ఇప్పటికే నిర్ణయించాయి. ఇప్పటి వరకు అందుతున్న సమాచారం ప్రకారం బిఆర్ఎస్ నుంచి మాగంటి సునీత ఖరారుకాగా, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బిజేపి నుంచి దీపక్ రెడ్డిలు బరిలో నిలిచే అవకాశం కనిపిస్తుంది. అభ్యర్థులు ఖరారు కాకపోయినా జూబ్లీ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ప్రదానపార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి.

హైదరాబాద్(సాక్ష్యం):

బిఆర్ఎస్ గట్టెక్కేనా..?:

జూబ్లీహిల్స్ ఉపఎన్నికను బిఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికలతో పాటు, కంటోన్మెంట్ ఎన్నికలలో ప్రతికూల ఫలితాలు రావడంతో బిఆర్ఎస్ కొంత ప్రతిష్టను కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. వరుస ప్రతికూల ఫలితాలు బిఆర్ఎస్ క్యాడర్ కాన్ఫిడెన్స్ ను దెబ్బతీసిన పరిస్థితి ఏర్పడింది.
గత సార్వత్రిక ఎన్నికలలో గ్రేటర్ పరిధిలోని మొత్తం స్థానాలను గెలిచినా ఆ పట్టును బిఆర్ఎస్ కొనసాగించలేకపోయిందనేది కొంత వాస్తవం. ఉప ఎన్నికలో విజయం సాధించడం ద్వారా పోయిన ప్రతిష్టను నిలబెట్టుకోవడంతోపాటు, కార్యకర్తల స్థైర్యాన్ని పెంపొందించడం ద్వారా వారిని తిరిగి కార్యోన్ముకులుగా చేయాలని బిఆర్ఎస్ భావిస్తుంది.
అందరికంటే ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన ప్రచారపర్వంలో దూసుకుపోతున్న బిఆర్ఎస్ సానుభూతి అస్త్రం తమను గట్టెక్కిస్తుందని బలంగా విశ్వసిస్తుంది. తమ అభ్యర్థిగా దివంగత శాసనసభ్యుడు మాగుంట గోపినాథ్ భార్య సునీత ఎంపిక చేసి ప్రచారాన్ని ఉధృతం చేసింది. మాగంటి మరణంతో ఏర్పడిన సానుభూతితోపాటు నియోజకవర్గంపై మాగంటికి ఉన్న పట్టు తమకు లాభిస్తుందని బిఆర్ఎస్ అంచనా వేస్తుంది.
అయితే ప్రతిష్టాత్మక పోరులో బిఆర్ఎస్ కు నగర నాయకత్వం పూర్తి స్థాయిలో సహకరించే పరిస్థితి కనిపించడంలేదు. కాంగ్రెస్ అభ్యర్థికి గ్రేటర్ పరిధిలోని బిఆర్ఎస్ కీలకనేతకు మధ్య బంధుత్వం గులాబికి ప్రతిబంధకం కాగలదు. ప్రస్తుతానికయితే బిఆర్ఎస్ అంతా సాఫిగా సాగుతుందని భావిస్తున్నప్పటికి, షెడ్యూల్ విడుదలయ్యి ప్రచారపర్వం ఊపందుకునే సరికి వాస్తవ పరిస్థితులపై క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తుంది

బిజేపికి పట్టుచిక్కేనా..?:

జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించాలని బిజేపి పట్టుదలగా ఉంది. సంప్రదాయంగా అర్బన్ ప్రాంతాలతో పాటు యువతలో బిజేపికి మంచి పట్టుఉంటుంది. ఉపపోరు జరిగేది అర్బన్ ప్రాంతం కావడంతోపాటు యువత ఎక్కువగా ఉండడం తమకు కలిసివచ్చే అంశంగా బిజేపి భావిస్తుంది. అయితే ఉపఎన్నికలలో పోటీచేయడంలేదని ప్రకటించిన టిడిపి, బిజేపికి మద్దతిస్తుందని ముందుగా ప్రచారం జరిగింది. అయితే తాము ఎన్నికలలో ఎవరికి మద్దతివ్వడంలేదని, తటస్థంగా ఉంటామని ఆపార్టీ ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది.
ఏ.పి.లో పొత్తుకారణంగా టిడిపి సానుభూతిపరుల మద్దతు తమకే ఉంటుందనేది బిజేపి ధీమా. ప్రస్తుతానికి అభ్యర్థి ఖరారు అంశంలో బిజేపి తీవ్ర కసరత్తు చేస్తుంది.
అందుతున్న సమాచారం ప్రకారం బిజేపి అభ్యర్థిగా దీపక్ రెడ్డి నిలిచే అవకాశం కనిపిస్తుంది. దీపక్ రెడ్డి పూర్వాశ్రమంలో టిడిపిలో కీలకంగా వ్యవహరించారు. గ్రేటర్ పరిధిలోని టిడిపి శ్రేణులతో దీపక్ రెడ్డికి మంచి సంభందాలు ఉన్నాయి. ఇది తమకు ప్లస్ పాయింట్ గా మారగలదనే అంచనాలో బిజేపి ఉంది. అభ్యర్థి ఖరారు ఘట్టం ముగిసిన తరువాత బిజేపి ఎన్నికల వ్యూహంపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది

సై అంటున్న కాంగ్రెస్:

జూబ్లిహిల్స్ లో పాగా వేయడం ఖాయం అని ధీమాగా ఉంది కాంగ్రెస్. అందుతున్న సమాచారం ప్రకారం జూబ్లీ ఉపపోరులో మజ్లీస్ కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వడం ఖాయంగా మారింది.
జూబ్లీహిల్స్ లో గణనీయమైన ఓటు బ్యాంక్ కలిగిన మజ్లీస్ మద్దతు కారణంగా తమ విజయం నల్లేరుమీద నడక కాగలదని కాంగ్రెస్ విశ్వసిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో టిడిపిలో కీలకంగా వ్యవహరించిన నేపధ్యంలో టిడిపి శ్రేణులు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తాయనే అంచనా ఉంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ తమ అభ్యర్థిగా నవీన్ యాదవ్ ను బరిలో దించడం ఖాయంగా మారింది. బి.సి. సామాజికవర్గానికి చెందిన నవీన్ కు ఆ వర్గాలు పూర్తిగా మద్దతిస్తాయని కాంగ్రెస్ అంచనా వేస్తుంది.
అదీగాక బిఆర్ఎస్ లోని కీలకనేతకు నవీన్ యాదవ్ కు బంధువు కావడం కాంగ్రెస్ కు కలిసి వచ్చే అవకాశం ఉంది.
అంతిమంగా విజయం తమదేనని, కంటోన్మెంట్ ఫలితం జూబ్లీహిల్స్ లో రిపీట్ అవడం ఖాయమనే ధీమా కాంగ్రెస్ శ్రేణుల్లో కనిపిస్తుంది

12న పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

మొదటిపేజీ తరువాయి..

పోలియో కేసులు నమోదు అవుతున్నాయని కేంద్ర వైద్యారోగ్య శాఖ పేర్కొంది.ఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి రాకపోకలు జరుగుతున్న దేశంలోని పలు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ 5 జిల్లాల పరిధిలో 0–5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

మయన్మార్‌లో తీవ్ర విషాదం

మొదటిపేజీ తరువాయి..

వ్యతిరేక పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్‌కు చెందిన స్థానిక అధికారి తెలిపారు. 47 మంది గాయపడ్డారని చెప్పారు. బౌద్ధ మూలాలతో కూడిన జాతీయ సెలవుదినం అయిన థాడింగ్యుట్ పండుగ కోసం సోమవారం సాయంత్రం చాంగ్ యు టౌన్‌షిప్‌లో సుమారు 100 మంది గుమిగూడి ఉండగా ఈ దాడి జరిగింది. థాడింగ్యుట్ పండుగను లైట్ల పండుగ అని కూడా పిలుస్తారు. మయన్మార్ అంతటా కొవ్వొత్తులు, లాంతర్లు. సామూహిక సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సమావేశం సైనిక నిర్బంధం, రాబోయే ఎన్నికలను నిరసిస్తూ.. అలాగే ఆంగ్ సాన్ సూకీతో సహా రాజకీయ ఖైదీల విడుదల కోసం కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది.

ముంబై దాడులకు ఎందుకు ప్రతీకారం తీర్చుకోలేదు

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ హయాంలోని యూపీఏ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పటి రాజకీయ నిర్ణయాలు మరో దేశం నుంచి వచ్చిన ఒత్తిడి ద్వారా ప్రభావితమయ్యాయని ఆరోపించారు. ముంబై దేశంలోని అత్యంత శక్తివంతమైన నగరాల్లో ఒకటి అని, అందుకే ఉగ్రవాదులు 26/11 దాడులకు తెగబడ్డారని అన్నారు. ఇటీవల, కాంగ్రెస్ మాజీ హోం మంత్రి పి. చిదంబరం ముంబై ఉగ్రదాడుల గురించి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ఒత్తిడి వల్ల తాము పాకిస్తాన్‌పై దాడి చేయలేదని చెప్పారు. ముంబై దాడుల తర్వాత మన భద్రతా దళాలు పాకిస్తాన్‌పై దాడి చేయడానికి సిద్ధమయ్యాయని, కానీ వేరే దేశం ఒత్తిడి కారణంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భద్రతా బలగాలను ఆపిందని చిదంబరం అన్నారు. దీనిపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఏ దేశం ఒత్తిడి తెచ్చిందో వెల్లడించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కారణంగా భారత్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదుల్ని బలపరిచిందని, ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా దేశం పదే పదే ఉగ్రవాదానికి మూల్యం చెల్లించాల్సి వచ్చిందని అన్నారు.
ఉగ్రదాడి అనంతరం సైనిక చర్యను అడ్డుకుంటూ ఆనాడు నిర్ణయం తీసుకున్నదెవరో చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాల్లో ముంబై ఒకటి కావడంతోనే ఉగ్రవాదులు దానిపై దాడి చేశారన్నారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని, దేశ ప్రజలకు ఈ విషయం తెలియాలని అన్నారు. కాంగ్రెస్ చూపించిన బలహీనతే ఉగ్రవాదులకు బలంగా మారిందన్నారు.

రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

మొదటిపేజీ తరువాయి..

డాక్టర్ షికోమ్ సకాగుచీకి నోబెల్ బహుమతి ఎంపికయ్యారు. అలానే భౌతిక శాస్త్రంలో జాన్ క్లార్క్, జాన్ ఎం మార్టీనిస్, మైఖేల్ హెచ్ డెవొరెట్‌లను నోబెల్ కమిటీ ప్రకటించింది. గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, అక్టోబర్ 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటిస్తారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు.

భారత్ నిర్ణయాలను శాసించలేం

మొదటిపేజీ తరువాయి..

సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించ కూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు అని గ్రీర్ తెలిపారు. రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగిన ది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళ్లు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది.

Godrej Finance Limited
Godrej FINANCE
A Godrej Capital Company

బహిరంగ ప్రకటన

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ - స్కేల్ బేస్డ్ రెగ్యులేషన్) డైరెక్షన్స్, 2023 లోని మాస్టర్ డైరెక్షన్ పేరా 43 ప్రకారం 'గోద్రేజ్ ఫైనాన్స్ లిమిటెడ్' నుండి బహిరంగ ప్రకటన.

గోద్రేజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("కంపెనీ" లేదా "జిఎఫ్ఎల్") కంపెనీస్ యాక్ట్, 1956 ప్రకారం స్థాపించబడిన ఒక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ (కార్పొరేట్ ఐడెంటిఫికేషన్ నంబర్: U67120MH1992PLC065457)గా ఉంది మరియు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వద్ద (COR. No: 13.00368) నాన్-డిపాజిట్ టేకింగ్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ ("NBFC")గా నమోదు చేయబడింది GFL తన రిజిస్టర్డ్ కార్యాలయాన్ని గోద్రేజ్ వన్, పిరోజ్‌షానగర్, ఈస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే, విఖ్రోలి (E), ముంబై - 400079, మహారాష్ట్రలో కలిగి ఉంది.

ఈ నోటీసు విడుదలైన తేదీ నుండి మూడు నెలల వ్యవధిలో సంస్థ తన శాఖ కార్యాలయాన్ని 201-A, 2వ అంతస్తు, షాంగ్రిలా ప్లాజా, రోడ్ నెం.2, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500034, తెలంగాణ క్రింది చిరునామా నుండి మూసివేసి ఆఫీస్ నంబర్ 3, మొదటి అంతస్తు,ఆదిత్య ట్రేడ్ సెంటర్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038, తెలంగాణ అనే చిరునామాకు మారుస్తుందని తెలియజేస్తున్నాము. ఈ మార్పు కార్యనిర్వహణ కారణాల వల్ల జరుగుతుంది.

అన్ని కస్టమర్ ప్రశ్నలను customercare@godrejcapital.comలో పరిష్కరించుకోవచ్చు.

ఈ విషయంలో ఏవైనా వివరణలు లేదా విచారణలను ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 (ముప్పై) రోజులలోపు కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయంలో చీఫ్ కంప్లైయన్స్ ఆఫీసర్ శ్రీ యోగేష్ జైన్ లేదా gfl.compliance@godrejfinance.com కు పంపవచ్చు.

Sd/-
గోద్రేజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

స్థలం: ముంబై
తేదీ: 09.10.2025